

'పట్టు' సాధించారు
సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ క్లస్టర్ సెరీకల్చర్ సాగులో ముందువరుసలో ఉంది. 8లో



ఆ గదిలో ఏం జరిగిందో..?
ఓ రేకుల ఇంట్లో అనుమానాస్పదస్థితిలో ఒకరు చనిపోగా.. ముగ్గురు తీవ్ర గాయాలతో స్పృహలో లేరు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. 8లో



యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా
గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రైస్‌మిల్ యజమానులు కొంత మందిని నియమించుకొని అక్రమ దందాకు పాల్పడుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 14వ తేదీన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

'పార్టీ మారనందుకే పదవి నుంచి తొలగింపు'

నర్సాపూర్: నర్సాపూర్ ఎంపీపీ అధ్యక్షురాలుగా కొనసాగిన గిరిజన మహిళ జ్యోతి తాను గెలిచిన కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి మారనందుకే సస్పెండ్ చేశారని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీయాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సొంత జిల్లాలో 16 నామినేట్ పోస్టులను భర్తీ చేశారని, అందులో బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులకు స్థానం కల్పించలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో నామినేటెడ్ పోస్టులకు అర్హత కలిగిన బడుగులు, గిరిజనులు లేరా అని ప్రశ్నించారు. గిరిజన మహిళకు రిజర్వేషన్ మేరకు కేటాయించిన ఎంపీపీ అధ్యక్ష పదవిని బీఆర్‌ఎస్ నాయకులు అగ్రవర్ణానికి చెందిన నర్సింగరావుకు కట్టబెట్టడాన్ని జిల్లాలోని గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ఆహ్వానం



ఉత్సవ కమిటీని ఆశీర్వదిస్తున్న చిన్నజీయర్ స్వామి

చేగుంట(తూప్రాన్): మండలకేంద్రమైన చేగుంటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆలయ ధర్మకర్త సురేశ్ ఆధ్వర్యంలో సోమవారం ముచ్చింతల్‌లో చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఏప్రిల్ 10 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో శేఖర్, పూజారి వాసుదేవచారీ, చందూ, పరంజ్యోతి, నర్సింలు, రాఘవ, రఘువీర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న జయశ్రీ

మెదక్‌జోన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ అన్నారు. సోమవారం ద్వారకా గార్డెన్స్‌లో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ వర్క్‌షాప్‌ను జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయశ్రీ హాజరై మాట్లాడారు. తెలంగాణలో సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం అన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు రక్షణ కరువైందని.. డాక్టర్ ప్రీతికి విషయంలో వాస్తవాలను ప్రభుత్వం తొక్కే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్దన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ఏడుపాయల దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించారు. పూజారులు సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ బాలాగౌడ్, ఈఓ శ్రీనివాస్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోదారి పరుగు

- పొంగిపొర్లుతున్న హల్దీవాగు
- జిల్లాలోని ఆరు మండలాలు సస్యశ్యామలం
- 50 వేల ఎకరాలకు సాగు నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వెల్దుర్తి మండలం కొప్పులపల్లి శివారులో హల్దీవాగు

మెదక్‌జోన్: జిల్లాలో గోదారి పరుగులు తీస్తుంది. హల్దీ వాగు జిల్లాలో ప్రవహిస్తుండగా.. చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. ఆరు మండలాల పరిధిలో సుమారు 50 వేల ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయి. ఇవి కాక కాళేశ్వరం కాలువ ద్వారా ఇప్పటికే పలు మండలాల్లో నీరు ప్రవహిస్తోంది.

జిల్లాలో హల్దీవాగు సుమారు 70 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇది సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వర్గల్ వద్ద ప్రారంభమై మెదక్ మండలం ర్యాలమడుగు వద్ద మంజీరా నదిలో కలుస్తోంది. తూప్రాన్, వెల్దుర్తి, కొల్చారం, చిన్నశంకరంపేట, మెదక్, హవేళిఘణపూర్ మండలాల పరిధిలో ప్రవహించి 50 వేల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో ఇక్కడి రైతులు ఎక్కువగా బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేసేవారు. కాగా గత రెండేళ్లుగా గోదావరి నీటిని హల్దీలోకి మళ్లించడంతో పాటు కాళేశ్వరం కాల్వల ద్వారా రామాయంపేట, నార్సింగి, చేగుంట, నిజాంపేట, చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండలాలకు నీరందుతోంది. హల్దీలోకి ప్రతిఏటా మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో నీటిని వదులుతారు. ఇటీవల నీరు వదలడంతో చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. బోరుబావుల్లో సైతం గణనీయంగా నీటి మట్టం పెరుగుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈ వాగు నుంచి ఏటు 3 కిలోమీటర్ల వరకు భూగర్భజలాలు పెరుగుతాయని, ఫలితంగా బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి రైతులకు సాగునీరు పుష్కలంగా అందనున్నట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే వాగు పరిధిలో తొమ్మిది చెక్‌డ్యాంలు నిర్మించడంతో గ్రౌండ్ వాటర్ గణనీయంగా పెరుగుతున్నట్టు సమాచారం.

సంతోషంగా ఉంది



హల్దీవాగులోకి గోదావరి జలాలు రావడం సంతోషంగా ఉంది. వాగు పరిధిలో నాకు రెండున్నర ఎకరాలు ఉండగా వరి సాగు చేశా. నీరు తగ్గడంతో ఆందోళనకు గురయ్యా. కానీ ఇటీవల మళ్లీ హల్దీలోకి నీరు వదలడంతో సంతోషంగా ఉంది.

– లాయక్‌పాష, రైతు, కొప్పులపల్లి

ఆరునెలల వరకు నీటి తడులు



హల్దీవాగులోకి గోదావరి జలాలను ఒక్కసారి వదిలితే ఆరునెలల వరకు పంటలకు నీటి తడులు అందుతాయి. అలాగే భూగర్భ జలాలు సైతం పుష్కలంగా ఉంటాయి. గత రెండేళ్లుగా హల్దీలోకి గోదావరి జలాలు వదులుతున్నాం. ఈ ప్రాజెక్ట్ పరిధిలో గల ఆరు మండలాల్లోని 50 వేల ఎకరాలు సస్యశ్యామలం మారుతున్నాయి.

– ఏసయ్య, ఎస్ఈ, ఇరిగేషన్, మెదక్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన డీఈఓ రాధాకిషన్

ఒకనెల కష్టపడితే బంగారు భవిష్యత్

పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ రాజర్షిషా సూచన

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి పునాది వంటిదని.. ఒకనెల కష్టపడితే బంగారు భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులు, హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి మూడు స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. పిల్లల చదువు సామర్థ్యాన్ని బట్టి మూడు గ్రూపులుగా విభజించాలన్నారు. సీ గ్రూపులో ఉండే విద్యార్థులు ఏ గ్రూపుకు చేరుకునేలా నిరంతరం ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈనెల 18 నుంచి జరిగే రెండో ప్రీ ఫైనల్, ఏప్రిల్‌లో జరిగే ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, జెడ్పీ సీఈఓ శైలేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరుచోట్ల ప్రత్యేక క్లీనిక్‌లు

మహిళా దినోత్సవంగా సందర్భంగా జిల్లాలోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్, వెల్దుర్తి, శివ్వంపేట, మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా క్లీనిక్‌లు, జిల్లా ఆస్పత్రిలో రిఫెరల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆరోగ్య మహిళ, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల బకాయిల చెల్లింపుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 8న చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఆర్‌డీఓ ద్వారా జిల్లాలో 10,749 స్వయం సహాయక సంఘాలకు రూ. 38, కోట్ల 35 లక్షల 43 వేల వడ్డీ లేని రుణ బకాయిలు, మెప్మా ద్వారా 568 స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.3 కోట్లకు పైగా రుణ బకాయిలు అందనున్నాయని కలెక్టర్ వివరించారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ రమేశ్



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి అర్జీలను అధికారులు సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణికి 60 అర్జీలు రాగా 10 డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పింఛన్లకు 10, ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఐదు దరఖాస్తులు వచ్చాయి. మిగితా 35 భూ సమస్యలు, ధరణి, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఇతర శాఖలకు సంబంధించివి ఉన్నాయి.

దేశాభివృద్ధికి విద్య, వైద్యం కీలకం



మాట్లాడుతున్న నర్సింగరావు, పక్కన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

సీఎంఓ కార్యదర్శి నర్సింగరావు

శివ్వంపేట(నర్సాపూర్): దేశాభివృద్ధికి విద్య, వైద్యం కీలకమని సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి సింగయిపల్లి నర్సింగరావు అన్నారు. సోమవారం శివ్వంపేట, చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలల్లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి మన ఊరు– మన బడి నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత అన్ని శాఖలపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా.. మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వద్ద నర్సింగరావు ఉండడంతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరుకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, డీఈఓ రాధాకిషన్, పీఆర్ ఈఈ యుగేందర్, డీపీఓ సాయిబాబా, సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, బాలమణి నరేందర్, ఎంఈఓ బుచ్చానాయక్, హెచ్‌ఎం ఇందుమతి పాల్గొన్నారు.

శాంతియుతంగా హోలీ జరుపుకోవాలి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: హోలీ పండగను జిల్లా ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. రోడ్లపై యువకులు, పెద్దలు వాహనాలను అడ్డుకొని బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

'సదరం' కోసం మీసేవలో సంప్రదించండి

మెదక్ కలెక్టరేట్: అర్హులైన దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు నిర్వహించే క్యాంపు తేదీలు ప్రకటించామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఈ–సేవ, మీ సేవలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని రసీదులో కేటాయించిన రోజు హాజరుకావాలని ఆయన సూచించారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

డీఎంహెచ్‌ఓ చందూనాయక్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ చందూనాయక్

వెల్దుర్తి(తూప్రాన్): మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళా ఆరోగ్య పథకాన్ని తీసుకురానుందని డీఎంహెచ్‌ఓ చందూ నాయక్ తెలిపారు. సోమవారం వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8న వెల్దుర్తి పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా పథకాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి మంగళవారం ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, సిబ్బంది మాత్రమే ఉండి మహిళలకు 8 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. వెల్దుర్తి ఆస్పత్రికి రూ. 29 లక్షలు మంజూరయ్యాయని.. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఆస్పత్రి నిర్వహణకు రూ. 88 వేల నిధులు సిద్ధంగా ఉన్నాయని త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం ఆస్పత్రి ఆవరణను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని.. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్నం 12 గంటలు దాటాక విధులకు హాజరుకావడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన లేకుండా విధులకు హాజరైతే ఎలా అని ప్రశ్నించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి చీపుర్లు సమకూర్చడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తెలుసుకొని వెంటనే షోకాజ్ నోటీస్ అందజేయాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీఓ విగ్నేశ్వర్, ఐకేపీ ఏపీఎం శంకరయ్య, వైద్యులు పాల్గొన్నారు.

మహిళా.. సుఖీభవ

- 'ఆరోగ్య మహిళ' పేరుతో ప్రత్యేక వైద్య సేవలు
- ఉమ్మడి జిల్లాలో 23 ఆస్పత్రుల ఎంపిక
- ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక సేవలు
- ప్రధానంగా ఎనిమిది రకాల రుగ్మతలపై దృష్టి
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభం




ఇందిరమ్మకాలనీలో బస్తీ దవాఖానా

సాక్షి, సిద్దిపేట: మహిళా ఆరోగ్యంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వారు ప్రధానంగా ఎదుర్కొంటున్న రుగ్మతలను పారద్రోలేందుకు ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ మంగళవారం ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఉమ్మడి జిల్లాలో 23 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసింది. రేపు ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు.

24 గంటల్లో రిపోర్టులు..

- సాధారణంగా మహిళలు ఎదుర్కొనే ఎనిమిది రుగ్మతలకు సంబంధించి స్క్రీనింగ్, పరీక్షలు, చికిత్స అందించనున్నారు. ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో షుగర్, బీపీ, రక్తహీనత వంటి వాటికి సాధారణ పరీక్షలతో పాటు లక్షణాల మేరకు సుమారు 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.
- కేన్సర్ స్క్రీనింగ్‌తోపాటు పీసీఓడీ, రుతుస్రావ సమస్యలు, మైక్రో న్యూట్రియంట్ డెఫీషియన్సీ, వెయిట్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ మేనేజ్‌మెంట్, ఫర్టిలిటీ సమస్యలు, మోనోపాజ్ మేనేజ్‌మెంట్, ఐవీ, థైరాయిడ్, విటమిన్ డీ–3, బీ–12 డెఫీషియన్సీ వంటి వాటిని ఆయా ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ చేయనున్నారు.
- దాంతో పాటు యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్, పెల్విక్ ఇఫ్లమేటరీ డిసీజెస్‌కు సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. వాటికి 24 గంటల్లోనే సంబంధిత రిపోర్టులను అందిస్తారు.
- అవసరమైన వారిని ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన రిఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ మెడికేషన్, కౌన్సెలింగ్ అందిస్తారు.
- బరువుకు సంబంధించి యోగా, వ్యాయామంపై అవగాహన కల్పించి, సూచనలు చేయనున్నారు.
- వైద్యం కోసం వచ్చే మహిళల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను కూడా రూపొందించారు. ఆస్పత్రి రిఫరల్ లింక్‌లు కూడా ఇందులో ఉంటాయి.

అందరూ మహిళలే..



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రేపు 'ఆరోగ్య మహిళ' పేరుతో ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. ప్రతీ మంగళవారం ప్రత్యేకంగా సేవలు అందించనున్నాం. ఆయా ఆస్పత్రుల్లో డాక్టర్లు, స్టాఫ్ అందరూ మహిళలే ఉంటారు. ఈ సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ కాశీనాథ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

నిరంతరంగా సేవలు..

- 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో భాగంగా ముందస్తుగా పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించనుంది. ఇందుకోసం ప్రతీ మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి ఉండనున్నాయి.
- ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానల్లో ఈ కార్యక్రమం అమలు కానుంది. ఈ కార్యక్రమాన్ని రేపు (8వ తేదీన) ప్రపంచ మహిళా దినోత్సవం నుంచి నిరంతరంగా కొనసాగనుంది.
- వయసుతో సంబంధం లేకుండా మహిళలందరికీ ఈ వైద్య సేవలు అందనున్నాయి. ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమం ప్రారంభానికి జిల్లా వైద్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఎంపిక చేసిన ఆస్పత్రులు

మెదక్‌లో 06:
మెదక్ జిల్లాలో ఆరు ఆస్పత్రులు.. అల్లాదుర్గం, వెల్దుర్తి, తూప్రాన్, టేక్మాల్, శంకర్‌పేట–ఏ, శివ్వంపేట ఉన్నాయి.

సిద్దిపేట జిల్లాలో 13:
సిద్దిపేట జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. అవి ఇందిరమ్మకాలనీ బస్తీ దవాఖానా, చిన్నకోడూరు, తోటపల్లి, మద్దూరు, మీర్జాపూర్, కూకునూరుపల్లి, సింగన్నగుడెం, మర్కూక్, ములుగు, వర్గల్, ఇందుప్రియాల్, తిమ్మాపూర్, తిగుల్ ఆరోగ్య కేంద్రం.

సంగారెడ్డిలో 04:
సంగారెడ్డి జిల్లాలో నాలుగు అవి.. ఆర్సీపురం, జిన్నారం, జీహెచ్ కోహీర్, ఝరాసంగం పీహెచ్‌సీలో ఈ ప్రత్యేక సేవలు ప్రారంభంకానున్నాయి.

శేరిపల్లిలో సంపూర్ణ మద్యపాన నిషేధం



మాట్లాడుతున్న సర్పంచ్ మల్లేశం

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి తీర్మాణం చేశారు. గ్రామంలో ఇటీవల మద్యపానంతో కిష్టయ్య అనే వ్యక్తి మృతిచెందాడు. దీంతో గ్రామంలోని మహిళా సంఘాల ప్రతినిధులు, సర్పంచ్ చెప్యాల మల్లేశం ఆధ్వర్యంలో పలుమార్లు సమావేశమై ఈవిషయమై చర్చించారు. సోమవారం గ్రామంలో మద్యం అమ్మకాలు బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా మద్యం అమ్మకాలు కొనసాగిస్తే రూ. పది వేలు, తాగితే రూ. ఐదు వేల జరిమానా విధించాలని తీర్మాణించారు. మద్యం అమ్మినవారిని పట్టిస్తే రూ. రెండు వేల నజరానా ప్రకటించారు. అనంతరం మహిళలు గ్రామంలో బెల్ట్‌షాపులు కొనసాగిస్తున్న వారి ఇళ్ల వద్దకు ర్యాలీగా వెళ్లి మద్యం అమ్మకాలు బంద్ చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సింలుగౌడ్, సత్యనారాయణ, సుశీల, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టు సాధించారు

చంద్లాపూర్ క్లస్టర్‌లో అత్యధికంగా మల్బరీ సాగు

తాటి జాన్‌రెడ్డి, సిద్దిపేట డెస్క్ ...

సెరీకల్చర్ సాగులో రైతులు పట్టు సాధిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ప్రతీనెలా నికరంగా ఆదాయం వస్తుండడంతో సాగుకు అధికంగా మొగ్గుచూపుతున్నారు. వేలల్లో పెట్టుబడి...లక్షల్లో రాబడి అనేక మంది రైతులను ఆకర్షిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 1,880 ఎకరాల్లో మల్బరీతోటలు సాగుచేస్తున్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ క్లస్టర్ సెరీకల్చర్ సాగులో ముందువరుసలో ఉంది. చంద్లాపూర్ క్లస్టర్ పరిధిలోకి వచ్చే గంగాపురం, చిన్నకోడూరు, నారాయణరావుపేట, విఠలాపూర్, చంద్లాపూర్ గ్రామాల్లో 200 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. చంద్లాపూర్ గ్రామంలో ఇప్పటికే 25 షెడ్లు వినియోగంలో ఉండగా, మరో ఐదు షెడ్లు నిర్మాణదశలో ఉన్నాయి. మూడుదశాబ్దాల నుంచి ఇక్కడి రైతులకు సెరీకల్చర్‌పై అవగాహన ఉంది.

షెడ్డు నిర్మాణానికే వ్యయం

పట్టు పురుగుల పెంపకంలో షెడ్డు నిర్మాణానికే రైతుకు మొదటగా అధిక వ్యయం అవుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పొడువు 40 ఫీట్లు, 20 వెడల్పుతో, 15 ఫీట్ల ఎత్తుతో షెడ్డు నిర్మించాలి. దీనికి సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ప్రభుత్వం ఓసీ, బీసీ కేటగిరి వారికి రూ. 2లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.60 లక్షలు సబ్సిడీగా షెడ్డు నిర్మాణం పూర్తయ్యాక అందజేస్తుంది. ఇది కాకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా షెడ్డు నిర్మాణానికి రూ. లక్ష వరకు సబ్సిడీ కూడా ఇస్తున్నారు. అయితే మెజారిటీ రైతులు 50 ఫీట్ల పొడవు, 25 ఫీట్ల వెడల్పు, 15 ఫీట్ల ఎత్తుతో షెడ్లు నిర్మిస్తున్నారు. దీనికి ఎనిమిది లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతుంది.



ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగు ఇలా (ఎకరాల్లో)

సిద్దిపేట	1,005
సంగారెడ్డి	550
మెదక్	325

ప్లాంటేషన్‌కూ సబ్సిడీ

- ఒక ఎకరంలో సుమారు 6 వేల మల్బరీ మొక్కల వరకూ నాటొచ్చు. రవాణా ఖర్చులతో కలుపుకొని ఒక్కో మొక్కకు మూడు రూపాయల వరకూ ఖర్చు అవుతుంది. ప్లాంటేషన్‌కు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ఓసీ, బీసీలకు ఒక్కో యూనిట్‌కు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.32,500 వరకు సబ్సిడీగా అందజేస్తుంది. ఎకరం వరి పొలానికి అందించే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో మల్బరీసాగు చేసుకోవచ్చు. సంవత్సరం వ్యవధిలో నాలుగు నుంచి ఐదుసార్లు పంట దిగుబడి తీయవచ్చు. మల్బరీసాగుకు కోతులు, అడవి పందుల బెడద ఏమీ ఉండదు. రాళ్ల వర్షం తాకిడిని కూడా ఈ మొక్క తట్టుకోగలదు. ఒక్కసారి నాటితే పదిహేనేళ్ల వరకూ మల్బరీ ఆకు తెంపుకోవచ్చు.



- సెరీలైమ్, విజేత పౌడర్, విజేత సప్లిమెంట్ పౌడర్, బ్లీచింగ్ మందులు ఈ సాగులో వినియోగిస్తారు. సెరీకల్చర్ జిల్లా కార్యాలయంలో కూడా మందులు అందుబాటులో ఉంటాయి. వీటిపై కూడా 50 శాతం వరకూ సబ్సిడీ ఉంది.

లాభాలు ఒడిసి పట్టుతున్నాడు



చంద్లాపూర్‌కు చెందిన పెద్దోళ్ల అయిలయ్యకు సెరీకల్చర్ సాగులో విశేషమైన అనుభవం ఉంది. 1989 నుంచి ఈ సాగులో ఉన్నాడు. అప్పటి నుంచి పదిహేనేళ్లపాటు మల్బరీతోటలు పెంచాడు. కొంతకాలం గ్యాప్ ఇచ్చి 2017 నుంచి సాగు చేస్తున్నాడు. ఆయన క్షేత్రాన్ని మంత్రి హరీశ్‌రావు కూడా సందర్శించారు. సాగువిధానం, మెలకువలు తెలుసుకోవడానికి వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు చెందినవారు ఆయన క్షేత్రానికి వస్తుంటారు. నాలుగు ఎకరాల్లో సాగుచేస్తున్నాడు. ప్రతీబ్యాచ్‌లో 250 నుంచి 300 గుడ్ల ద్వారా 333 కేజీల వరకు పట్టుగూళ్ల దిగుబడి తీస్తున్నాడు. నెలకు అన్ని రకాల ఖర్చులు కలిపి సాగుకు రూ. 25వేలు అవుతుండగా, దిగుబడి గణనీయంగా ఉంటోంది. పట్టుగూళ్ల ద్వారా గత డిసెంబర్‌లో రూ. 2,43,000, జనవరిలో రూ. 2,02,000, ఫిబ్రవరిలో రూ.1,90,000 ఆదాయం సంపాదించాడు.

ఉన్నత చదువులు చదివినా..

చంద్లాపూర్‌కు చెందిన సంతోష్ ఉస్మానియా యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చదివాడు. బీఈడీ కూడా పూర్తిచేశాడు. హాఫ్‌మార్కులో డీఎస్సీ మిస్ అయ్యింది. రెండేళ్లపాటు ప్రైవేట్ స్కూల్‌లో పని చేశాడు. తర్వాత స్వగ్రామానికి వచ్చాక కుటుంబసభ్యులతో కలిసి మొదటగా డెయిరీ అనుకున్నాడు. కొన్ని ఆవులు, గేదెలు తీసుకొచ్చారు. ఊర్లో ఎక్కువ మంది రైతులు మల్బరీసాగులో ఉన్న కారణంగా సెరీకల్చర్‌పై దృష్టి సారించాడు. బీఏ, బీఈడీ పూర్తి చేసిన భార్య అనిత కూడా సపోర్ట్ చేసింది. మూడు ఎకరాల్లో మల్బరీసాగు చేశాడు. దంపతులిద్దరూ ఈ పనిపైనే దృష్టి పెట్టారు.. అప్పుడప్పుడు అమ్మానాన్న చేదోడువాదోడుగా ఉంటున్నారు. 50 రింగ్ (సుమారు 30 నుంచి 35 వేల గుడ్లు) ఉన్నవి నాలుగు కొనుగోలు చేశాడు. ఒక్కోరింగ్ రూ. 700లకు కొనుగోలు చేశాడు. ఎగ్స్, కూలీలు, ఎరువులు, ట్రాన్స్‌పోర్ట్ ఇలా అన్నింటికి ఒక్క జనవరిలో నెలలో 13 వేల రూపాయల వరకు ఖర్చు చేశాడు. అదే నెలలో పట్టుగూళ్ల ద్వారా రూ.1,62,000 ఆదాయం వచ్చింది. ప్రతీరోజు ఉదయం రెండు గంటలు, సాయంత్రం వేళ రెండు గంటలు దంపతులిద్దరూ ఈ పనిలో నిమగ్నమవుతారు.



ఇన్సెంటివ్...

మల్బరీసాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తోంది. కేజీ పట్టుకు రూ.75 వరకు అందజేస్తోంది. 2018 నుంచి రైతులకు ఇన్సెంటివ్ అందడం లేదు.



పరిసరాలూ ముఖ్యమే

మల్బరీ సాగు చేసేచోట చుట్టూ వేసే వివిధ పంటలు, వాటికి చల్లే మందులు, పిచికారీ దీనిపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా పట్టుగూళ్లు తయారయ్యే చివరిదశలో దిగుబడి తగ్గుతుంది. మల్బరీ ఆకుపై వివిధ రకాల మందుల ప్రభావం పడకుండా ఉండేందుకు..కొమ్మలు తెంపి పట్టు పురుగులకు వేయడానికి ముందు మల్బరీ చెట్లపై ఎయిర్‌గన్‌తో వాటర్ స్ప్రే చేస్తారు.



చాకీ సెంటర్లు..

గుడ్డు పొదిగే దశ నుంచి పట్టుపురుగుగా మారే వరకు సుమారు ఎనిమిది రోజుల ప్రక్రియ ఉంటుంది. కొందరు రైతులు స్వయంగా చేసుకుంటుండగా, మరికొందరు రైతులు చాకీ సెంటర్లపై ఆధారపడుతున్నారు. 100 డీఎల్ఎఫ్ (డిసీస్ ఫ్రీ లేయింగ్) ధర రూ. 2,500 నుంచి రూ.3,500 వరకు ఉంటుంది. ఈ ధరలోనూ హెచ్చుతగ్గులు ఉంటాయి. వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లలో ప్రస్తుతం చాకీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.

రెండుచోట్ల కొనుగోలు కేంద్రాలు

పట్టు గూళ్ల అమ్మకానికి రైతులకు మార్కెటింగ్‌పరంగా ఎటువంటి ఇబ్బందులు లేవు. హైదరాబాద్‌లోని తిరుమలగిరి, జనగామలో రైతులు పట్టుగూళ్లు అమ్ముకోవచ్చు. కేజీ చొప్పున ధర లెక్కకడతారు. వేలంపాట ద్వారా పట్టుగూళ్ల కొనుగోళ్లు జరుగుతాయి. కేజీకి కనిష్టంగా రూ.500, గరిష్టంగా రూ.800వరకు ధర పలుకుతుంది. మార్కెట్‌కు వచ్చే పట్టుగూళ్లు, వాటి నాణ్యత ఆధారంగా ధరలోనూ హెచ్చుతగ్గులు ఉంటాయి.

నెలకో బ్యాచ్



కొందరు రైతులు ప్రతినెలకో బ్యాచ్ చొప్పున 12 నెలలూ ఆదాయం సంపాదిస్తున్నారు. మెజారిటీ రైతులు అయితే పది నుంచి పదకొండు నెలలు పట్టుగూళ్ల ద్వారా ఆదాయం పొందుతున్నారు.పట్టు గుడ్లను మైసూర్, బెంగుళూరు నుంచి దిగుమతి చేసుకోవచ్చు. 100 రింగ్‌కు రూ.1,400 వరకూ ధర ఉంటుంది. ఒక్కో రింగ్‌లో అరవై వేల వరకూ గుడ్లు ఉంటాయి. గుడ్లు పొదిగేయడం మొదలుకొని పట్టుపిల్లగా మారడానికి ఎనిమిది రోజులు పడుతుంది. ఇంట్లోనే చిన్నచిన్న ట్రేలలో వీటిని పెంచొచ్చు. ఈ దశలో రైతు శ్రద్ధను బట్టే పంట దిగుబడి ఉంటుంది. పట్టు పురుగు పరిమాణం 9వ రోజు కొద్దిగా పెరుగుతుంది. అప్పుడు మల్బరీ సాగుచేసిన చోట నిర్మించిన షెడ్డుకు తరలిస్తారు. 21 నుంచి 24 రోజుల వరకు పురుగు పెరిగి, పట్టు గూళ్లు తయారవుతాయి. మార్కెట్‌కు తీసుకెళ్లడానికి ఒకరోజు ముందు వీటిని బస్తాల్లోకి నింపుతారు. పట్టుపురుగు పెరగడానికి ఉదయం సాయంత్రం వేళ ప్రతిరోజూ తప్పనిసరిగా మల్బరీ ఆకు వాటికి ఆహారంగా వేయాలి.

క్లుప్తంగా

బ్లాస్టింగ్‌కు కూలిన ఇంటిపై కప్పు



కొల్చారం(నర్సాపూర్): మండలపరిధిలోని రాంపూర్ శివారులో ఓ స్టోన్ క్రషర్‌లో ఆదివారం అర్ధరాత్రి చేపట్టిన పేలుళ్లకు ఇందిరానగర్ కాలనీలోని బూరిగాళ్ల వెంకటి ఇల్లు పైకప్పు పూర్తిగా కూలిపోయింది. స్టోన్‌క్రషర్ యజమానిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్‌తో కలిసి అదనపు కలెక్టర్ రమేష్‌ను కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి



దుబ్బాక: విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని అహ్మద్‌నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. షేక్ బాబా, పఠాన్ బాబాలకు చెందిన రెండు పాడిగేదెలు వ్యవసాయపొలం వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు బోరు మోటారుకు సంబంధించిన కరెంటు తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.

సైబర్ నేరగాళ్లు.. స్వాహాపర్వం

జాగ్రత్తగా ఉండాలంటున్న సిద్దిపేట సీపీ శ్వేత



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్‌కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శ్వేత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజు ఏ రకమైన సైబర్ నేరాలు జరుగుతున్నాయో పత్రికల ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదని, ఫోన్లు వినియోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు....

- సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఇన్‌స్టాగామ్‌లో 'వర్క్ ఫ్రమ్ హోం' అంటూ ఓ ప్రకటన కనిపించింది. వెంటనే అందులో తన వివరాలు నమోదు చేశాడు. అంతేకాకుండా ఆ ప్రకటనలో ఉన్న నంబరుకు కాల్ చేశాడు. వెంటనే సైబర్ నేరగాడు ఓ లింక్ పంపాడు. కొంత మొత్తం డబ్బులు పెట్టుబడి పెట్టగా, మొదటగా కొద్దిగా లాభం వచ్చింది. దీంతో ఎక్కువ మొత్తంలో లాభం సంపాదించాలన్న ఆశతో రూ.3,50,000 పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం ఆ నంబరు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఓ యాడ్ చూశాడు. అందులో తక్కువ ధరే ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకం అనే సమాచారం ఉంది. వెంటనే యాడ్ డిస్‌ప్లేలో ఉన్న ఫోన్‌నంబర్‌కు కాల్ చేశాడు. తాను మిలటరీకి చెందినవాడినని, రవాణా ఖర్చుల నిమిత్తం కొంత మొత్తం డబ్బు పంపాలన్నాడు. ఇది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.13,999 పంపి మోసపోయాడు.
- చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి టెలీగ్రామ్‌లో సైబర్ నేరగాడు పరిచయమయ్యాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయంటూ నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు రూ.లక్ష పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం ఆ నంబరుకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ రాంరెడ్డి కథనం మేరకు... మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన అప్పనపల్లి ఎల్లయ్య (38) కుటుంబ అవసరాలు, వ్యవసాయానికి అప్పు చేశాడు. బాకీ చెల్లించాలంటూ ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారు. అప్పు తీర్చేమార్గం కనిపించక ఎల్లయ్య సోమవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతునికి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వకు గండి.. కేసు నమోదు

దుబ్బాకరూరల్: మల్లన్నసాగర్ కాల్వకు గండికొట్టిన వారిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... మండలపరిధిలోని అప్పనపల్లి, చెల్లాపూర్, రాజక్కపేట గ్రామాలకు మల్లన్నసాగర్ కాలువ ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. సరిహద్దు గ్రామమైన మోహినికుంట(రాజన్న సిరిసిల్ల జిల్లా)కు చెందిన కొందరు కాల్వకు జేసీబీతో గండికొట్టి నీటిని మళ్లించారు. ఈ ఘటనపై సోమవారం నీటి పారుదలశాఖ ఏఈ తిరుపతి ఫిర్యాదు చేయగా, సత్యనారాయణ, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.



ఆ గదిలో ఏం జరిగిందో..?

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి తీవ్రగాయాలు. ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు
- దర్యాప్తు చేస్తున్నాం: పటాన్‌చెరు డీఎస్పీ



సంఘటన స్థలంలో బిసుదలై మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు

పటాన్‌చెరు టౌన్: ఓ రేకుల ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మెడకు తాడుతో ఒకరు చనిపోయి ఉన్నాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. అందులోనూ ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎవరూ స్పృహలో లేరు. ఈ ఉదంతం భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి, బీడీఎల్ సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలోని ఓ రేకుల షెడ్డులో ఒడిశాకు చెందిన నిరుదలై, తుకుననాయక్, అభిదలై ఐదేళ్లుగా నివాసముంటున్నారు. రెండువారాల క్రితం ఇదే రాష్ట్రానికి చెందిన బిసుదలై(30) ఇక్కడకు వలస వచ్చి వీరి రూమ్‌లో చేరాడు. నలుగురూ స్థానికంగా ఓ మేస్త్రీ వద్ద పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఆ రూమ్‌లో ఘర్షణ జరిగిందని తెలుస్తోంది. బిసుదలై మెడకు తాడు బిగించి చనిపోయి ఉన్నాడు. మిగతా ముగ్గురు కూడా తీవ్రంగా గాయపడి ఉన్నారు. సోమవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చేరుకుని గాయాలపాలైన ముగ్గురిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాలెన్నో...

బయటకు నుంచి వచ్చి ఎవరైనా ఈ నలుగురిపై దాడి చేశారా? లేదా ముగ్గురిపై దాడి చేసిన తర్వాత బిసుదలై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? నలుగురిలో ఒకరంటే ఒకరికి పడక ఘర్షణ పడ్డారా.. అసలు ఆ రాత్రి అసలేం జరిగి ఉంటుంది? ఇలా వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నలుగురి సెల్‌ఫోన్ల కాల్‌డేటా కూడా పరిశీలిస్తున్నారు. డీఎస్పీ భీంరెడ్డి మాట్లాడుతూ గాయపడిన ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఎవరైనా స్పృహలోకి వస్తే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

ఏడుపాయలలో నీటమునిగి భక్తుడి మృతి



వెంకటేశ్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు నీటమునిగి మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివేట మండలం కొల్కూర్ గ్రామానికి చెందిన బోయిని వెంకటేశ్(26) ఆదివారం ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం చెక్‌డ్యాం వద్ద స్నానం చేస్తూ ఈతరాక మునిగాడు. రాత్రి కావడంతో అతడి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బంధువుల ఇంటికి వచ్చి...

కొల్చారం(నర్సాపూర్): బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రంగంపేట శివారులో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయం వెనకాల సోమవారం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఏఎస్ఐ తారాసింగ్, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా పొదిలి మండలం కాంటువారిపాలేనికి చెందిన ఆంజనేయులు(38) ఈ నెల 4వ తేదీన భార్యకు చెప్పకుండా రంగంపేటలో ఉంటున్న వరుసకు సోదరుడి కొడుకైన వెంకటేష్ వద్దకు వచ్చాడు. విషయం తెలుసుకున్న వెంకటేష్ స్వగ్రామానికి వెళ్లాలంటూ ఆంజనేయులుకు సర్దిచెప్పాడు. అయినా పట్టించుకోకుండా రోజూ మద్యం సేవిస్తూ బస్టాండ్‌లో నిద్రించేవాడు. రెండు రోజుల తర్వాత ఆంజనేయులు సోమవారం విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు.

ఆటోను ఢీ కొట్టి...



రామస్వామి మృతదేహం

గజ్వేల్‌రూరల్: రాయపోల్ గ్రామానికి చెందిన రామస్వామి(28) ఓ శుభ కార్యక్రమానికి తన ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ సమీపంలో ఆటోను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారుఢీ కొని..

జిన్నారం(పటాన్‌చెరు): వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి... ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ విజయకృష్ణ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామానికి చెందిన పుట్టి నర్సింలు(40) హైదరాబాద్ నుంచి బైక్‌పై సొంత గ్రామానికి వెళుతున్నాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి ప్రధాన రహదారి మేడలమ్మ దేవాలయ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నర్సింలుకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నర్సింలు మృతదేహం

బైక్ అదుపు తప్పి...

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి చెందాడు. బీదర్ పట్టణ సమీపంలో మైలూర్‌కు చెందిన రాహుల్(30) పల్సర్ బైక్‌పై జహీరాబాద్‌కు వచ్చాడు. పనులు ముగించుకుని ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణంలో 65వ జాతీయ రహదారిపై మాడ్గి శివారులో ఆయన బైక్ అదుపుతప్పింది. బైక్‌పై నుంచి కిందపడ్డ రాహుల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ నడుపుతున్న యువకుడికి ఫిట్స్

అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): బైక్ నడుతున్న ఓ యువకుడికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. దీంతో నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని ఢీకొట్టగా, ఇద్దరూ గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. చిన్నశంకరంపేట నుంచి ప్రశాంత్ బైక్‌పై స్వగ్రామమైన మెదక్ మండలం భూపతిపూర్‌కు వెళుతున్నాడు. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో గవ్వలపల్లి సబ్‌స్టేషన్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న కొర్విపల్లి గ్రామానికి చెందిన బాలయ్యను ఢీ కొని కిందపడిపోయాడు. ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.